# ప్రేమంటే యిదేరా

"మీరిద్దరూ ప్రేమించుకున్నారా? మోహించుకున్నారా?" నవ్వుతూ అడిగింది జ్యోతి. "నీ బోయ్ ఫ్రెండు తరుచూ యిటుకేసి వస్తూ కంటబడుతున్నాడు గిరికా?"

"మొదటిదే జ్యోతీ! నాది గుడ్డిమోహం గాదు. స్వార్థమెరుగని నిష్కల్మషమైన ప్రేమ" అన్నది గిరిక.

"కలాపం ముందెవరు మొదలెట్టారూ? మాటలతోనా చేతలతోనా? యిద్దరూ ఒకేసారి బిగిన్ చేశారా?" మళ్ళా నవ్వింది జ్యోతి.

వాళ్ళిద్దరూ ఒకే యీడువారు. సహాధ్యాయినులు. పబ్లిక్ పార్కులో చెట్లు అడ్డమున్నచోట రాతి అరుగుమీద కూచుని వున్నారు. సముద్రపు ఘోషా, మసాలా వాసన, పిల్లల పరుగులు, కేరింతలు, చల్లగాలీ, పెరుగుతున్న కొబ్బరిమొక్కల ఆకులు గాలికి వూగి, వీరి మొహాలమీద వాలి గిలిగింతలు పెడుతున్నాయి.

"నేను బిగిన్ చేసేందుకు నాకు క్రెడెన్షియల్స్ యేవీ?" అన్నాది గిరిక, తన చేతి వేళ్ళూ గోళ్ళూ చూస్తూ.

"పోతే పోయింది గానీ, నలుగురి నోళ్ళలో నానితే నానావు గానీ గిరికా మై ఫ్రెండ్! భలేవాడిని పట్టావు! యేమనుకోకపోతే ఒక విషయం తెలుసుకోవాలని వున్నది."

"నొచ్చుకునేందుకేమీ లేదు. నువే అన్నావుగా నానుతున్నానని, అడుగు. నేనూ తెలుసుకుంటాను" అని మొహమెత్తింది.

"నీలో యేం చూసి...." అని ఆగిపోయి, మళ్ళా ఆలోచించి,

"అంత సాహసానికి దిగాడూ మగాడూ?" అని పూర్తి చేసింది.

"స్త్రీత్వం చూసి, మాతృత్వం చూసి," నిర్లిప్తంగా అన్నది గిరిక.

"చిన్న కోరిక" అభినయించింది జ్యోతి.

"నాకు నీ కోరిక తీర్చాలని వున్నది. దాని పేరే ప్రేమ. దానికి లోనై మరొకరి కోరిక తీర్చాను వెరవక" అని గోళ్లు చూసుకున్నాది గిరిక.

"యేమని ఆశపెడితే లోనై తీర్చావూ?" జ్యోతి అడిగింది.

అప్పటికి చీకటి అలుముకున్నది పూలవాన కురుస్తున్నట్లు సన్నని తుంపర పడి నేలమీదనించి సువాసన రాసాగింది.

"చిన్న ఆశను లొంగననేమో పెద్ద ఆశే పెట్టాడు ప్రేమికుడు. తాను ప్రొడ్యూసర్ కొడుకునన్నాడు. నాది తీయని గొంతుట. నా లలిత సంగీత ప్రోగ్రామ్ విన్నానన్నాడు. తన తండ్రి తీసే చిత్రాలలో నేపథ్యగాయనిగా అవకాశం కల్పిస్తానన్నాడు. నేను లొంగింది ఆశకే. లొంగదీసింది ప్రేమికుడు గాదు. లేమి. ఈసడింపులూ, వెక్కిరింపులూ, భావదాస్యంతో విసిగిపోతున్న నామీద అతని మాటలు పూలవాన పడినట్లు పనిచేశాయి".

"ప్రూవ్ చేశాడూ?" కుతూహలంతో అడిగింది జ్యోతి.

"చేశాడు. ప్రొడ్యూసరుగారు తీసిన ఫిల్మ్ టెక్నికల్‌గా

బాగున్నది. కాసులు తేలేకపోయినా నా డిస్క్స అమ్ముడుపోయి కొంత లాభించింది. కథ ట్విస్ట్స అండ్ టరన్స్‌తో యెలాగో ముగిసింది." కొంత నవ్వూ కొంత విచారం కలిపింది గిరిక.

"అతనందించిన అవకాశం యెందుకొదిలేశావూ? ఒంటరి దానివెందుకైనావూ తెలుసుకోవచ్చా?" నిదానంగా అడిగింది.

"నిరాక్షేపణీయంగా తెలుసుకోవచ్చు. నా చేతిలో డబ్బు నా స్వేచ్ఛ, నా ప్రైవేసీ నావాళ్ళకు కంటగింపు అయాయి."

"దీని ముష్టి యెవడిక్కావాలీ? ప్రేమికునే పట్టాలని ట్రై చేసి ఫెయిలయినారు. అహం దెబ్బతిన్నది వారికి. ఈర్ష్యాసూయలు వారిని లొంగదీసినై. 'పేలెడు లేదు, భూమికి జానెడెత్తు లేదు దీనినే పట్టాడెందుకో మిలియనీర్. వయసులో గూడా యిద్దరికీ బాగా తేడా వున్నదే. దీనికెలా వశమైనాడో!' అనుకుని వుండాలి. మిలియ నీర్లోని లొసుగులు లోపాలూ కనబడక, విడదీయాలని పథకం వేసి వుండాలి. రికార్డింగ్‌కి వెళ్ళి లేట్‌గా యిల్లు చేరాను. వాన్ వెళ్ళి పోయింది. చూస్తే తలుపుకి తాళం, చిన్న వెల్తురు దీపం పడి మెరుస్తూ కనబడింది"

"నీది గుడ్డిమోహం కాదన్నావు గానీ గిరికా, నీకూ లోపాలూ లొసుగులూ కానరాలేదేమో." అన్నది జ్యోతి.

"కాదు జ్యోతీ! కనబడినాయి కానీ, ప్రేమంటే యిదేరా అనే చిత్రం, పాటా నచ్చాయి గనక సరిపెట్టుకుంటూ లేమిని ఓడిస్తున్నా నని సంతోషించాను. గోల్ చేరాలి."

జ్యోతికి నవ్వు వచ్చింది." మచ్చుకి రెండు లొసుగులు రెండు లోపాలూ చెపుతావా? నాకు లాభించవచ్చు."

"దానికేం. తెలుసుకో. ఓనాడు పిక్చర్‌కి తోడుకెళ్లాడు. దర్పంగా మాట్లాడుతూ బాక్సుకెళ్దామా అన్నాడు. వెళ్దామన్నాను. తీరా చూస్తే ధనికుని జేబీలో యిద్దరికి సరిపడా పైసాలేదు. నేనసలే తేలేదు. ఇన్‌వైట్ చేసింది నే గాదు. గేట్ కీపర్ నన్ను చూడగానే వైదొలగాడు. మిలియనీర్ టికెట్ సగం చేసి యిచ్చాడు. అపుడే పిక్చర్ రన్నవుతున్నది, టార్చి వేసి తోడువచ్చి రెండు సీట్లు చూపి వెళ్ళిపోయాడు. చిత్రం చూడక కుళ్ళుంకలేశాడు మిలియనీర్.

"నిన్ను టికెట్ లేకుండా రానిచ్చాడేం లోపలికి?"

"ఈ థియేటర్ మా బావది, వెంటబెట్టుకొచ్చి కూచోబెట్టి వెళ్ళేవాడు"

"బావంటే అత్తకొడుకా, మామకొడుకా, అక్క మొగుడా?"

"అవేవీ కాదు, మా పెద్దన్న క్లాస్‌మేట్ స్నేహితుడు గూడాను. మా అన్న తన ప్రాణస్నేహితులను బావా అనీ వారి భార్యలను అక్కా అని పిలవటం అలవాటు చేసుకుని నాకూ అలాగే అలవాటు చేశాడు. ఆ అన్న రైలు ప్రమాదంలో పోయాడు. కాని వాడు చేసిన అలవాటు పోలేదు. గేట్ కీపరికి నేను తెలుసు."

"ఇలాంటి బావలింకా యెంతమంది వున్నారూ?"

"యెంతమంది వున్నా అంతా యీ వూళ్ళోనే లేరు. వారికి

థియేటర్లూ లేవు" అని చెప్తూ చూశాను. అనుమానం, అసూయా, హేళనా గ్రహించాను.

ఇంకొకసారి టెక్నికల్ పరీక్ష వ్రాస్తున్నాను. పూర్తి కాలేదు, యెక్కడినించో వూడిపడ్డాడు ప్రేమికుడు. "నేను పనిమీద ముంబాయి వెళ్తున్నాను. తాజ్ హెూటల్లో దిగుదాం. వస్తారా?" అని మీదకొరిగాడు.

'రాను. మరీ వీటిమనిషిలాగా, వ్యభిచారిలాగా నా? పరీక్ష పూర్తి చేసుకోవద్దా? మీ వెంట ముంబాయి వెళ్లానని తెలిస్తే మా టీచ రేమనుకుంటుందీ?' అన్నాను.

,,నీ భాష నాకు రాదు. అంత శ్రద్ధా? అది పాసైనా చిన్న జాబే నిన్ను వరించేది. నేనంతకంటె పెద్ద అదాయం వచ్చేదే అందించానే.,, అని వాటేసుకున్నాడు.

"ఐసీ. నాకు డబ్బు యెర పెట్టారనీ, దానికోసం గడ్డి తినాల్సి వస్తుందనీ వూహ రాలేదు. వెరీ సారీ. అట్టి ఆదాయమందే అవకాశం కోసం మా యింట్లో వాళ్ళే తహతహలాడుతున్నారు. మీరు కళ్ళతో పిలిచినా ఆ జాబ్కోసం మీ వెంట వస్తారు. మీ కడగంటి చూపుకోసం తపించిపోతున్నారు" అని నవ్వుతూ వది లించుకుని పారిపోయినాను. కోపగించాడేమో, కుక్కపిల్లగాదని గ్రహించాడేమో మరి.

సరసమూ లేదు. వేళా లేదు. మార్దవమూ లేదు. రఫ్‌గా ట్రీట్ చేయసాగాడు మిలియనీర్. పని కానిచ్చుకుని పోవటమే. మురిపాలూ లేవు, గుడ్‌బై లేదు, సారీ పని వున్నదనే మాటే లేదు.,

మరొొకసారి వెంట రమ్మని సజెస్ట్ చేస్తు, "జంక్షన్ వరకూ రా, నేను కలకత్తా మెయిల్ అందుకుంటాను, నువ్వు వెనక్కి వచ్చేయచ్చు, అప్పటికింకా తెల్లవారదు తెల్లారేసరికి యింట్లో కనిపిస్తావు. సరేనా?"

'రాను' అన్నాను. "యేమిటి బాధ?" అన్నాడు విసుగ్గా.

"ఈ పద్ధతిలో యెంతమందిని ప్లీజ్ చేస్తున్నానో అని మీకూ మావాళ్ళకీ అనుమానం రావచ్చు. మరోడితో వుండగా పట్టాలని సిఐడీ వుద్యోగం చేస్తారు" అని నవ్వేశాను.

ఒకసారి వచ్చినప్పుడు అలిసిపోయి, బడలిపోయి బాగా నిద్ర పోయాడు ప్రేమికుడు, త్వరగా లేచి టిఫిన్ కాఫీ వేడి వేడిగా తయారుచేసి, మిలియనీర్ స్నానం కానిచ్చి దుస్తులేసుకు రాగానే ముందుంచాను. అదో మోస్తరుగా నవ్వుతూ తలూపుతూ ఆవడలు, గారెలు, వుప్మా, యిడ్లీ ఆరగించి, కాఫీ తాగాడు,

"చాలా బావున్నయ్యి, చాలా రుచిగా గూడా వున్నాయి చట్నీతో సహా, మీరింత మంచి తాజా టిఫిన్ తింటారనుకోలేదు. మా వంటవాడు చేస్తే గారెలూ, ఆవడలూ, కొయ్యముక్కలల్లే వుండి పులుపు పెరుగు, కాఫీ నీళ్ళగా వుంటుంది, ఉప్మాలో రాళ్లు, నీవే చేశావా? యేదో డిబ్బరొట్టె నిన్నటిది ముందుంచితే అది కోసి తినాలేమో నని ఆలోచిస్తు వచ్చి కూచున్నాను" అని నవ్వాడు. మొహాన చిరుచెమట కర్చీఫ్‌తో అద్దుకున్నాడు.

''దిబ్బరొట్టె నాకోసముంచుకుని, మీరు నాజూకు అని రుచి అయినవి తాజా ఫలహారం మీకు సర్వ్ చేశాను. మంచి టిఫిన్‌కి మేము మొహంవాచి లేము అని మిలియనీరుగారనుకోవాలని నా ఐడియా'' అని నేను నవ్వాను.

"థాంక్సు. సొంపుగా వున్నాయి మాటలు గిరికా. నీది ప్రేమే నేమో అనిపిస్తున్నది. తాళం చూశాక యేమైందీ పూర్తిచేయి మరీ పొద్దుబోకముందు వెళ్ళిపోదాం" అన్నది జ్యోతి.

మా పక్కింటి అబ్బాయిపేరు దేవసహాయం. క్లెప్టోమానియాక్ స్ట్రీట్‌లైట్ పడి మెరుస్తున్న తాళం వంక చూస్తూ నిలబడి వున్న నన్ను చూశాడు. అతను తన యింటి పిట్టగోడ దూకి వచ్చాడు.

"గిరికా! తాళం తీయాలా? ఇంట్లోవారంతా యెటో వుడాయించారు. మా గొప్ప తాళం వేశారు. నే తీస్తాను. తమాషా చూడు. నా దగ్గర డూప్లికేట్లున్నాయి" అని దేముడు తన మహిమ చూపుతున్నట్టు పాంట్ జేబులోంచి గారడీ చేస్తున్నట్టు తాళం గుత్తి తీశాడు. నంబర్ చూసి తాళం అలాగ్గా తీశాడు. ఇద్దరం లోపలికెళ్ళగానే తలుపు చప్పుడు గాకుండా మూశాడు దేవసహాయం. కౌబోయ్ పాంటుకి మరో జేబున్నాది. దానినుంచి పెన్సిల్ టార్చి తీసి వెలిగించి యిల్లంతా తిరుగుతుంటే అతని వెంట నేనూ తిరిగాను. బీరువా గోడలో అమర్చివున్నది. దాని తాళమూ అలాగ్గా తీశాడు. పెన్సిల్ టార్చితో వెతికితే డబ్బు లేదు.

'మీవాళ్ళు డబ్బు మానియాతో బాధపడుతున్నారు గిరికా.

అంతా మూటగట్టి తీసుకుపోయారు. నన్ను మానియాక్ అంటారు మీవాళ్లు. జగత్తంతా మానియాయె కాదా గిరికా?' నింపాదిగా వెతికి ఓ చిన్న సంచీ దుమ్ముకొట్టుకున్నాది కనుగొన్నాడు. దాని తాడు లాగాడు. అరచేతిలోకి వంచితే మర్రాకున పడుకుని కాలిబొటన వేలు తన రెండు చేతులతో నోట్లో పెట్టుకుంటున్న బంగారుబొమ్మ పడింది. బాగా మాసింది విగ్రహం.

'ఇది ఒకటున్నదని తెలియదేమో. తెలిస్తే వదిలేయరు. ఇది కనీసం మూడు తులాలుంటుంది. పద గిరికా రక్షకభటుడు రావచ్చు'. బీరువా సద్ది తాళం వేశాడు, వీధిలోకొచ్చి తాళం బిగించాడు దేవసహాయం.

'వుయి ఆర్ పాల్స్, ఫిఫ్టీ ఫిఫ్టీ, నేను బోయ్‌ఫ్రెండు గాను. పట్టిస్తావా?' అని నవ్వుతున్నాడు.

'పట్టించను పాల్' అన్నాను.

మరొక జేబులోంచి బిల్స్ తీశాడు దేవసహాయం. కొన్ని దొత్తిగా వేసి మడిచి నా చేతిలో పెట్టాడు. బంగారు పతకం మరో జేబులోకి పోనిచ్చి బటన్ పెట్టేశాడు.

'ఫ్లాష్‌బాక్ సౌండ్ ట్రాక్ కావాలా గిరికా?' అన్నాడు.

'కావాలి' అన్నాను.

'నీవు లేనప్పుడు నీ బోయ్ ఫ్రెండొచ్చాడు, గోడ పొట్టిది గదూ, నాకు కిటికీలోంచి కనిపించారు. మీవాళ్ళకు కామన్‌సెన్సు లేదేమో, కాకా పట్టటం రాదేమో, మగాళ్లతో డేళ్ళల్లే అతనిమీద

కురికారు, అడంగులు కొండశిలలల్లే చుట్టేశారు. నీ బోయ్‌ఫ్రెండు బాలకృష్ణుడు కాళీయుని తోకపట్టుకుని పైకి తేలినట్టు వాళ్ళ తోకలు మెలిపెట్టి వదిలించుకుని కొండశిలల తోకలు కోసి పారిపోయాడు. నా రూమ్‌లో వీడియో ఫిల్ము దాచాను' అంటూనే రివ్వున పారి పోయాడు.

"ప్రేమంటే యిదేరా, అని పాడుకుంటూ నేనూ యిల్లు వదిలి చీకట్లో నడిచాను. మీద చేయి వేయలేదు, యెంత సభ్యత! ఎంత ధర్మబుద్ధి. ఆపద సమయంలో ఆదుకున్నాడు దేవసహాయం" అన్నది గిరిక సముద్రంలో విరిగిపడే కెరటాల వంక చూస్తూ.

"లే పోదాం. యేడున్నర దాటింది" అని లేవదీసింది జ్యోతి.

(2)

బోల్ట్ ఫ్రమ్ ది బ్లూ లాగా వూడిపడ్డాడు మిలియనీర్. ఆ చిన్న వన్ బెడ్‌రూం ఫ్లాటంతా కలయతిరిగి చూశాడు. వచ్చీరాని తప్పటడుగులేస్తూ, చతికిలపడుతూ తానే లేస్తూ పెద్ద కళ్ళు తిప్పుతూ చూస్తున్న కుమారుడ్ని చూశాడు ప్రేమికుడు. దిసమొలకి యెర్రని పట్టుతాడు తప్పితే యేమీ లేదు.

'ఇక్కడుంటున్నావా? నాకు తెలియజేయచ్చునే వేరింటి కాపరం వెలిగిస్తున్నానని! నీ ఫ్రెండ్ జ్యోతి టి. వి. స్టేషన్‌లో కంటబడితే వాకబ్ చేస్తే చెప్పింది. నీ వాళ్ళనలా నట్టేట్లో వదిలేసి రావటం కల్చరా? మళ్ళీ వాళ్ల మొహం చూడదలచలేదా యేం?

అక్కడే అందుతావు డబ్బు పారేసి పోదామని, క్రైసిస్ వచ్చిందని తెలిసి, అఘమేఘాల మీద వస్తే 'చెప్పా పెట్టాకుండా యెటో వుడా యింది. మరో మిలీయనీర్ని ఆకర్షించిందేమో మనకెందుకను కున్నాము గానీ, రక్త సంబంధం గనక విచారిస్తే, మా పక్కింటి దేవ సహాయం మా మొహాల మీదే నవ్వుతూ అన్నాడు. 'నేనే గిరికకు మొనేటరీ హెల్పు చేసి పారిపోయి నీ బోయ్ఫ్రెండ్ రోగం కుదుర్చు' అని సలహా యిస్తే గిరిక అక్షరాలా నా సలహా అమలు చేసింది.' మిలియనీర్ మొహం కర్చీఫ్‌తో అద్దుకుని కుర్చీలో కూచుని కంటిన్యూ చేశాడు. "గిరికా! నీకు తెలియదేమో, నాది ఇన్‌క్యూరబుల్ డిసీజ్. వాడెవరు కోన్ కిస్కాగాడు? నాస్త్రీకి మోనే టరీ హెల్పు చేసెందుకూ సలహా యిచ్చేందుకూ? ఫూల్. నా స్త్రీ నేనెక్కడుండమంటే అక్కడుండాలి నా కోసం వెయిట్ చేస్తూ. ఐయామె బిజీ మాన్. మతం మారావా? కచ్చపట్టి మతం మారి వుంటే నా ప్రాపర్టీలో నీకు వాటా వుండదు. అలా వీలు వ్రాస్తాను. చేతగాని వాడినా?" వెనక్కి వాలిన మిలియనీర్ సరిగా కూచుని కళ్లు విప్పి చూస్తే డైనింగ్ టేబిల్ మీద డెలిషస్ డిషెస్ ఫ్లేవర్ గుబాళిస్తూ ఆహ్వానించాయి.

"మీల్సు రెడీ సార్. ఆకలి మీద వుండి తిడుతున్నారు" అని తీయగా నవ్వుతూ ఆహ్వానించింది గిరిక.

బేసిన్‌లో చేతులూ మొహం చల్లని నీళ్ళతో కడుక్కుని టవల్‌తో అద్దుకుంటూ వచ్చి, టవల్ ఒళ్ళో పరుచుకుని స్పూన్ అండ్ ఫోర్క్‌తో అరగిస్తున్నాడు. కుమార్ వచ్చాడు. కాలు నాను కుని నిలబడి నవ్వుతూ చూస్తున్నాడు ప్రేమికుని వంక

మెత్తగా వున్న హల్వా స్పూన్‌తో తీసి కుమార్ నోట్లో పెడుతూ మధ్య మధ్య ఒక్కొక్క డిష్షే పూర్తి చేశాడు. ఐస్‌వాటర్ తాగాడు. మూతి అద్దుకుని ఐస్‌క్రీమ్ కప్పు దగ్గరగా జరుపుకున్నాడు. అదీ పూర్తయింది, లేచాడు. కుమార్ కాలు వదిలి పారాడుతూ వెళ్ళిపోయాడు. ప్రేమికుని బెడ్‌రూమ్ బెడ్లూ ఆహ్వానించాయి. పొట్ట భర్తీ అయింది కళ్లు మూతలు పడుతున్నాయి. బెడ్‌రూమ్‌లో వుయ్యాల నానుకుని నిలబడి కుమార్ కనిపించాడు. వాడిని వుయ్యాలలో పక్కమీదుంచి తాను బూట్లు తీసి బెడ్‌మీద వాలాడు.

గిరిక తానూ భోజనం కానిస్తూ 'ప్రేమంటే యిదేరా' అని సన్నగా పాడింది. టేబిల్ క్లీన్ చేసి డ్రెస్ చేసుకుంటుండగా, రాజీ, జ్యోతీ వచ్చి కాలింగ్ బెల్ నొక్కారు. గిరిక తలుపు తీసి లోపలికొస్తుంటే అనుసరించారిద్దరూ.

"ఇవాళ డబ్బింగ్ వున్నదని గుర్తు లేదా గిరికా? రికార్డింగ్ సిద్ధమైంది. డైలాగ్సు వచ్చాయా, డ్యూయెట్ ఒకటి వున్నదన్నారు టైమ్‌కి ముందే హాజరయేదానివెంతకీ రాకపోతే మమ్మల్ని పంపారు. కారు హారన్ వినపడలేదూ?" అలా అంటూ తల తిప్పి కళ్లు తిప్పి చూసే కుంభకర్ణుడి ఫోజులో వున్న ప్రేమికుడు కంటబడ్డాడు. కుమార్‌బన్నీ కౌగలించుకుని నిద్రపోతున్నాడు. ఫాన్ తిప్పి వచ్చారిద్దరూ. ప్రశ్నార్థకంగా చూస్తే ఔనని తలాడించింది గిరిక.

"దూషణా అనుమానం డయిలాగ్సు వల్లించలేదూ?" అని రాజీ వెటకారం చేసింది.

'ప్రేమంటే యిదేరా' అని రాగం తీసి, 'అదొక రకం నెగెటివ్ ప్రేమ లెద్దూ' అన్నది గిరిక.

"ప్రేమ గాదది, జెలసీ. అవసరాని కందకుండా పోయి తర్వాత వచ్చి దెప్పటం తిట్టటం. సూటీపోటీ మాటలూ" అంటున్నది జ్యోతి.

"వూరుకుందూ, లంచ్ యిచ్చేప్పటికి ఆలస్యమైంది." మళ్ళా కారు హారన్ కాలింగ్ బెల్ మోగాయి. ప్రేమికుడు బరువుగా విప్పాడు. యెదురుగా జ్యోతి నిలబడి కనిపించింది.

"మేము రికార్డింగ్‌కి అటెండ్ కావాలి. డబ్బింగ్ చిత్రం తీస్తున్నారు, కుమార్‌కి మీరు కాపలా వుండండి మేము వచ్చేదాకా" అంటూనే గిరుక్కున తిరిగింది.

ముగ్గురూ లిఫ్ట్‌వేపు పరుగెత్తారు.

సాయంకాలం నాలుగున్నర వరకు మంచి నిద్ర తీశాడు మిలియనీర్. బడలిక తీరింది. కాలింగ్ బెల్ వినబడింది. లేచి వెళ్ళి తలుపు తీస్తే యెదురుగా సంజీవ్. వెనక్కి తిరగగానే అతని వెనకే దొరవగా సంజీవ్ లోపలికొచ్చి కుర్చీలో కూచున్నాడు, కుమార్ లేచి కూచుని కళ్ళు నులుపుకుని నించుని పట్టె పట్టుకుని చూస్తే తల్లి కనబడలేదు.

"ఇంట్లో లేదా గిరి? రింగ్ చేస్తే, నో రిప్లై. వాళ్ళ వాళ్ళ నొదిలి విడిగ వుంటున్నదని తెలిసింది. డైరెక్టోరియల్ స్టాఫ్‌లో చేరిన నువ్వ షూటింగ్‌కి స్విట్జర్లెండ్ వెళ్ళావని మా స్టూడియోలో

పనివాళ్లు చెప్పారు. ఇబ్బంది పడుతున్నదేమో సహాయం కావాలేమో నని వచ్చాను. మీ అమ్మ పెద్ద మేనమామ పెద్ద కొడుకుననీ, మా మధ్య ప్రేమానుబంధాలు యెక్కువేననీ చెప్పాను. పోర్ట్‌లో జాబ్ అని చెపితే, 'తోడుండండి కూరలూ కిరాణా తెచ్చిపెడుదురుగాని' అన్నది గిరిక, "రాత్రిళ్లు తోడుండటం మర్యాద గాదు, నా భార్యా అనుమానం మనిషని నచ్చచెప్పాక సరేనన్నది గిరిక. కాఫీ ఫ్లాస్కులో పోసి వుంచి వెళ్తుందే?" అని తల తిప్పి చూస్తున్నాడు సంజీవ్. బుర్ర ముక్కు, చిన్న నుదురు, మనిషి నలుపు బీడీలు తాగే అలవాటు నల్లనల్లబారిన బండ పెదిమలు స్థిరంగా కూచోలేక పోతున్నాడు.

"నాకు తెలియదు. నేను నిద్రకుబడ్డాను. వెతికీతాను. విదేశం వెళ్లానుగానీ, షూటింగ్ పూర్తిగాక వుండిపోవాల్సి వచ్చింది తిరిగి వచ్చేప్పటికిది పిట్ట గూట్లో లేదు. యెగిరిపోయింది. డబ్బు పారేస్తూ వుంటాను, మీవాళ్ళ దగ్గరుండు, లేకపోతే నిందలు పడతావని చెప్పాను" అన్నాడు ప్రేమికుడు. తిన్నదంతా యింకా పూర్తిగా అరగక పొట్ట బరువుగానే వున్నాది.

సంజీవ్ లేచాడు బెల్ మోగితే. గిరికేమోనని తలుపు తీస్తే సరికొత్త మనిషి లోపలికొచ్చేశాడు, సంజీవ్ తెల్లబోయాడు, కుర్చీలో కూలబడ్డాడు, మనిషి నించుని వున్నాడు, జబర్దస్తీగా అన్నాడు. "ఇవాళ ఫస్టు తారీకు, అద్దె వసూలు చేయటానికి వచ్చాను. ఆమె రెడీగా వుంచుతారే. ఇంట్లో లేరా?" అన్నాడు లోపలికి చూస్తూ. వారతన్ని కూచోమనేలేదు, సూటువాలాయే వాడు.

"అద్దె యెంత?" అన్నాడు సంజీవ్.

"మూడువేల రూపాయలు" అన్నాడు సూటువాలా. "డ్రాఫ్ట్ అయినా ఫరవాలేదు. ఇవాళే యివ్వాలి అదీ షరతు."

"ఇంత చిన్న ఫ్లాట్‌కి అంత రెంటా? చెల్లిస్తున్నాడీ గిరీ?" నోరు వెళ్ళబెట్టాడు సంజీవ్.

"చెల్లించలేకపోతే బకాయీ పడితే ఓడ్డని తాకట్టుపెడుతుంది. టిప్పు సుల్తాను తన యిద్దరు కొడుకులను, తెల్లవారి వద్ద పన్నెండు లక్షలకి తాకట్టుపెట్టాడు చూశారూ, అలాగా, చెల్లించగానే బిడ్డ నిచ్చేస్తాం, ఆశ్చర్యమెందుకు సార్. ఇది మోడరన్ ఫ్లాట్, అన్ని సౌకర్యాలున్నాయి. రింగ్ చేస్తే కారూ డ్రైవరూ బిల్డింగ్ ముందుం టారు. ఈ బిల్డింగ్‌లోనే, ఫిజిషన్, సర్జన్ గైనకాలజిస్ట్ వున్నారు ప్రైవేట్ ప్రాక్టీషనర్సు. బేస్‌మెంటులో మెడికల్ హాలున్నది. కాంటీనూ, రెస్టారెంటూ వున్నాయి, చేసుకోలేని రోజున రింగ్ చేస్తే, రూమ్ సర్వీస్ అందుతుంది స్పేర్ రూమ్స్ వున్నయి. రోజుకి వంద చెల్లిస్తే గెస్టునంటులో వుంచచ్చు గెస్టుకీ అన్నీ అందుతాయి. మీరెవరు? యెజెంట్లా? బోయ్‌ఫ్రెండ్సా? ఇనఫర్మేషన్ కావాలా? ఫ్లాట్ కొంటారా? వన్ బెడ్‌రూమ్ ఫ్లాట్ నాలుగు లక్షలు. రూల్సు న్నాయి, వాయిదాలమీదా చెల్లించవచ్చు" అంటున్నాడు నవ్వుతూ.

"నేను ఆ రెండూ కాదు. రెలెటివ్‌ని. చూసిపోదామని వచ్చా నంతే" అన్నాడు సంజీవ్. ఫాను తిరుగుతున్నా చెమటలు పడు తున్నాయి.

"అద్దె చెల్లిస్తారా? యెసి రూమ్ వున్న ఫ్లాట్ ఇంకో లక్ష యెక్కువ సార్." నిలబడే వున్నాడు సూటువాలా. బిడియం లేదు.

"నేను యేజెంటును గాను, డబ్బు పారేస్తూ వుంటాను. ఫెయిత్‌ఫుల్‌గా వుండాలని ఖరారు చేసుకున్నానంతే. అద్దె నేనెందుకు చెల్లించాలీ? నాచేత ఎక్‌స్ట్రాగా మూడువేలు రెంట్ రూపంలో లాగాలనీ, లేదా చెల్లించేట్టు చేయాలని ప్లానువేసి యిక్కడ దూరిందా గిరిక? స్వంత మనుషులూ స్వంత యిల్లూ వున్నదే?" అన్నాడు ప్రేమికుడు. చిరుకోపం వచ్చింది. "నిన్ను నమ్మటమెలా. నువ్వు బోయ్‌ఫ్రెండవేమో, లేదా యేజెంటువేమో" అన్నాడు విసుగ్గా.

నేను నా యజమాని ప్రతాపరాజా వారిచే నియమించబడిన అద్దెలు వసూలు చేసే యేజెంటును" అలా అంటూ ఫైలున్న పెట్టె తీసి బల్లమీదుంచి గిరిక పేరున్న ఫైల్ తీసి చూసాడు. గిరిక డబ్బింగ్ స్టార్ అని వున్నది. మూసేసి పెట్టెలో వుంచి మూసి పట్టుకున్నాడు. "ఈ పదకొండంతస్తుల భవనం నా యజమానిదే. అద్దె వసూలు కాలేదు గనక బిడ్డను తీసికెళ్ళే అధికారమున్నది నాకు" అలా అంటూ ధీమాగా వెళ్ళి, వుయ్యాల పట్టె పట్టుకుని నించుని వున్న కుమార్నెత్తుకుని వెళ్ళిపోయాడు. కుమార్ యేడవక పోగా యేజెంటు మెడ వాటేసుకుని మూతి మొహానికానిస్తూ వీరిద్దరినీ చూసి నవ్వుతూ నరవాహనమెక్కి వెళ్ళిపోయాడు.

కుర్చీలలో వున్న యిద్దరూ దిమ్మరపోయినట్టు యేజెంటు వెళ్ళిన వేపే చూశారు.

"నువ్వు వెయిట్ చేస్తూ రాత్రికి గూడా వుండదలచావేమో. నాకింకా అప్పాయింట్ మెంట్సు వున్నాయి ఇంటర్వ్యూలిచ్చి జాబ్ లోకి సెలెక్టు చేయాలి" సంజీవ్ లేచి వెళ్ళిపోయాడు.

స్తబ్ధుగా కూచునివున్న మిలియనీరెదుట క్లీనర్ శంకర్ నిల బడ్డాడు. "నమస్కారం." అన్నాడు. నీటుగా వున్నాడు.

"తాళంచెవి యెవరి దగ్గరుంటుంది. నీవెవరు? నేను పోవాలి" అన్నాడు ప్రేమికుడు.

"నేనీ బిల్డింగ్‌లో బేస్‌మెంటులో ఒక రూమ్ లో వుంటాను సార్. నాకు జీతమిస్తారు. క్లీనర్ని. బేస్‌మెంటు, కాంపౌండ్ క్లీన్‌చేసి ఫెన్సు కత్తిరించి అందంగా శుభ్రంగా వుంచుతాను. కార్లు కడిగి తుడుస్తాను, రింగ్ చేస్తే వచ్చి ఫ్లాట్ క్లీన్‌చేసి అన్నీ సర్దిపోతాను. నా దగ్గర డూప్లికేట్ వుంటుంది. మీరు కొత్తవారా సార్!" అన్నాడు.

"నువే చూసుకో, తాళం వేసుకో. నేనిప్పుడే పోతున్నాను" అన్నాడు మిలియనీర్.

3

ప్రేమికుని పరిస్థితి మెరుగైంది. సుకరమైన రాకపోకలు. కొత్తప్రేడం వూపిరి పీల్చనిచ్చింది. గిరిక కూతుర్నెత్తుకున్నది.

జ్యోతీ, రాజీ వస్తూపోతూ వుంటారు. "గిరికా నమ్మి చెడిన వారూ లేరూ అని పాడావు. ప్రేమంటే యిలా వుంటుందని ఋజువు చేశావు. ప్రేమికుడు నీ టాలరెన్సూ, యెండ్యూరెన్సూ

మెత్తదనం చూసి, సవితినీ తెచ్చాడు. ఆమెనూ కాపాడుతూ సెక్యూరిటీ యివ్వమన్నాడు. వేరే ఫ్లాట్‌లో వుంచితే సెక్యూరిటీ వుండదనీ, ముద్దుగా గౌరవంగా చూస్తూ పాత విషయాలెత్తి దెప్పకుండా వుంటే తానిప్పించే ట్రీట్‌మెంట్ ఫలిస్తుందనీ మళ్ళా సవితి తన యాక్టింగ్ కెరీర్ కంటిన్యూ చేస్తుందనీ ఆశపెట్టాడు. ఆమెను మామూలు మనిషిని చేయుట అనేది మానవహక్కుల పరిరక్షణలో కొస్తుందన్నాడు. సత్యమది కాదని తెలుసనుకో. సైకోని నీ నెత్తిన రుద్ది చాలా బాధ్యత తప్పించుకున్నాడు ప్రేమికుడు. నువ్వు 'ప్రేమంటే యిదేరా' అని పాడుకుంటూ ప్రేమ యిదే అని డెమాన్‌స్ట్రేట్ చేశావు. వచ్చేపోయే వారూ, డీసెంట్‌గా వుండలేనివారూ వారి స్వంత పన్లమీద వచ్చిపోతుంటే, వారికన్నీ అందించటమేగాక మెడికల్ హెల్పు గూడా అందేట్టు చూశావు. మిలియనీర్ తానొక ఫ్లాట్ కొని అందులో వుండి కీర్తి తెచ్చుకోవచ్చునే. హాస్యాలకు గూడా హద్దులేక, నొవ్వనాడి, 'చాలామంది నాకర్షిస్తున్నదే, చాలామంది పోగుబడుతున్నారే దాని ఫ్లాట్‌లో, దానధర్మాలు మానదు. అన్నసత్రం నడుపుతున్నది' అని గెస్ట్సు గేలి చేస్తుంటే తానూ వారితో శృతి కలిపాడు ప్రేమికుడు. అమ్మ పెట్టా పెట్టదు అడుక్కు తినానివ్వదు అని సామెత. పోనీ తాను టూ బెడ్‌రూమ్ ఫ్లాటు కొని నీ పేర పెట్టాడా లేదు. తన చేతిలో లక్షలు తిరుగుతున్నాయని గప్పాలు కొడుతాడు. దేనికి?" అని వాగుతూ పిల్లతో ఆడుతూ కుమార్‌తో ఆడుతూ సంతోషిస్తున్నాగు జ్యోతీ రాజీ.

"ప్రేమంటే యిదేరా అనే పాట పర్‌ఫెక్టుగా కుదిరింది. మాస్టర్‌పీస్. నువ్వు అడిగిన మొదటిసారే చెప్పాను జ్యోతీ. నాది

బ్లైండ్ లౌ కాదన్నాను. యే ఆశకు లొంగానో ఆ ఆశతోనే జీవిస్తున్నాను. నువ్వు గమనించలేదు. దైవం నా పక్షమే. ప్రేమకు కత్తిపోట్లు సమ్మెటపెట్లు తాకుతాయి. ఒక్కొసారి అడవులలో జీవిస్తుంది. సైకో తనకు తానే హాని చేసుకున్నది. అలివిగాక తన అంతరాత్మ మీాదే తిరుగుబాటు చేసి వెళ్ళిపోయింది. నేను లేనప్పుడు చూసి ప్రేమికుని గొంతు నులిమి తన మానసిక ప్రవృత్తి బైట పెట్టుకున్నది. వదిలించుకున్నాక నిజం తెలిసి యింక ఆమె పేరెత్తలేదు. అటు వెళ్ళలేదు. టు బెడ్‌రూమ్ ఫ్లాటా 'యీ చిత్రం కాసులు కురిస్తే నీకు టూ బెడ్‌రూమ్ ఫ్లాట్ కొనిపెడతానని ఆశ పెడుతూనే అంటిపెట్టుకుని తిరుగుతున్నాడు ప్రేమికుడు. ప్రేమే దైవము. దైవం సహాయపడుతూ నా ఆదాయం పడిపోకుండా చూడటమే గాక పెంచాడు. యెంత పోటీ యెదుర్కొన్నాను రాజీ! ప్రొడ్యూసరుగారు, నేనెవరో తెలియకుండానే, నాలుగు ముక్కల్లో నా కథ విని, "యెందుకలా మన్నిస్తావమ్మా? మరొకడుండ లేదా?" అన్నారు.

"ఆ మన్నన పేరే ప్రేమ సార్. ప్రేమ అలా వుంటుంది, మనమెన్ని తప్పులు చేస్తున్నా పరమేశ్వరి మన్నించి, యేదో రూపంలో సాయపడుతూనే వుంటుంది సార్" అన్నాను, నాకు క్రైసిస్‌లో సాయపడింది దైవసహాయమనే అబ్బాయి. క్లెప్టోమానియాతో అవస్థపడుతూ గూడా సహజగుణం, డీసెన్సీ బైటికి తెచ్చాడు ఆ ప్రొడ్యూసరుగారు వేరే ఫిల్మ్ తీయబోతున్నారు, నన్ను ప్లేబాక్ సింగర్‌గా తీసుకున్నారు, ప్రేమ అలా చేయిస్తుంది. అవకాశాలు అందిస్తుంది" అన్నది గిరి.